క్లుప్తంగా

మున్సిపల్ అభివృద్ధికి కృషి
చైర్‌పర్సన్ హేమలత



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ హేమలత

తుక్కుగూడ: తుక్కుగూడ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని చైర్‌పర్సన్ బరిగెల హేమలత పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలోని 9వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత విషయంలో రాజీ పడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శివకుమార్, భావన, నాయకులు రాజు, దేవేందర్, శేఖర్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు, ఎంఈఓ నరసింహా తదితరులు

కందుకూరు: టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కందుకూరులో ఎంఈఓ నరసింహా సమక్షంలో జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి భువనేశ్వరి, కందుకూరు జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత నూతన క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ మాట్లాడుతూ....విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం టీఎస్‌యూటీఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కె.రవి, ప్రధాన కార్యదర్శి బుగ్గ రాములు, ఆ సంఘం నాయకులు ఈశ్వర్, కుమార్, నజీర్, జంగయ్య, యాదయ్య, చెన్నయ్య, మహేష్, దినేష్, వెంకటాచారి, లక్ష్మణ్‌నాయక్, కాంచన, మల్లీశ్వరి, జ్యోతి,శారద, జైపాల్ పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జంగారెడ్డి తదితరులు

కందుకూరు: క్రీడల్లో గెలుపోటములు సహజమని వాటిని సమానంగా స్వీకరించాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి సూచించారు. శుక్రవారం కందుకూరులో కేకేఆర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం, స్నేహభావం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు సరికొండ పాండు, సీనియర్ నాయకులు సురసాని వీరారెడ్డి, ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, బొమ్మకూరు ప్రశాంత్‌కుమార్, ఎగ్గిడి జగదీష్, పాములు శ్రీశైలం, ఎండీ కాజామోహినుద్దీన్, ఎడ్ల ఉదయ్, గుండ్ర అనిల్, రాజశేఖర్, వెంకట్ సచిన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబురాలు



సంక్రాంతి వేడుకలో ఉపాధ్యాయులతో, చిన్నారులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని మౌంట్ కార్మెల్ గ్లోబల్ స్కూల్లో శుక్రవారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులు, చిన్నారులు సంబురాలు నిర్వహించారు. పేరేంట్స్‌కు ముగ్గుల పోటీలు నిర్వహించి అందరికీ బహుమతులు ప్రదానం చేశారు. భోగీ, కనుమ, మకర పేర్లతో మూడు రోజుల సంక్రాంతి ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ తార, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

తుర్కయంజాల్: విద్యార్థులు చదువుతో పాటు, అన్ని రంగాల్లోను రాణించాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. తుర్కయంజాల్‌లోని ఇండస్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను పరిశీలించి, అభినందించారు.



తుక్కుగూడ: జెన్నాయిగూడలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



పహాడిషరీఫ్: పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ యాతం పవన్ కుమార్ యాదవ్ తదితరులు



పహాడిషరీఫ్: బారులు తీరిన భక్తులు

ఘనంగా వైకుంఠ ఏకాదశి

వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాలు శుక్రవారం భక్త జనసంద్రంగా మారాయి. ఆలయ వేదపండితులు తెల్లవారుజామున 4 గంటలకు స్వామి వారికి అభిషేకం, అర్చన అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.



జిల్లెలగూడ వేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద క్యూలో నిల్చున్న భక్తులు



మీర్‌పేట: స్వామివారిని దర్శించుకున్న సబితా ఇంద్రారెడ్డి, స్థానిక నాయకులు



తుక్కుగూడ: శ్రీనగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో క్యూలో భక్తులు



కందుకూరు:చీకటి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజనీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ సిరికాలనీ, శివగంగ కాలనీ, స్టేడియం, రంగారెడ్డి జిల్లా కోర్టు, చిత్రా లేఅవుట్, గ్రీన్‌హిల్స్, ఖిల్లా మైసమ్మ, హరిపురికాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, 11కేవీ హుడా సాయికాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11కేవీ నేతాజినగర్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, ఆర్‌కేపురం, ఎల్‌బీనగర్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గ్రహించి తమకు సహకరించాలని రామకృష్ణ పేర్కొన్నారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏఈ బాలాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ జనార్దన్‌రెడ్డి ఫీడర్ పరిధిలోని భూపేష్‌గుప్తానగర్, గాయత్రినగర్, శ్రీధర్‌కాలనీ, వివేకనగర్, వెంకటేశ్వర కాలనీ, హనుమాన్‌నగర్‌లో మధ్యాహ్నం 12 నుంచి 1గంట వరకు, 11కేవీ లలితానగర్ ఫీడర్ పరిధిలోని గాయత్రి హోమ్స్, గాయత్రినగర్, సీతాహోమ్స్, జిల్లెలగూడ విలేజ్, వెంకటేశ్వరకాలనీ, మిథులా నగర్, సత్యసాయి ఎన్‌క్లేవ్, కమలానెహ్రూ నగర్, డీఎస్‌ఆర్‌నగర్‌లో మధ్యాహ్నం 12.30 నుంచి 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గ్రహించి తమకు సహకరించాలని ఏఈ బాలగౌడ్ పేర్కొన్నారు.

రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వినతి

బడంగ్‌పేట్: నాదర్‌గుల్‌లోని కోటగడ్డ నుంచి అంబేడ్కర్ నగర్ రఘువంశీ కాలనీ వరకు రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతూ కమిషనర్ సరస్వతికి, మేయర్ చిగురింత పారిజాతకు వేర్వేరుగా వినతిపత్రాలు అందచేశారు. శుక్రవారం నాదర్‌గుల్‌కు చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ఈ రహదారిగుండా ఆర్టీసీ బస్సులు, పాఠశాలల బస్సులు ఇతర వాహనాలతో రద్దీగా ఉంటుందన్నారు. ఈ గుంతలమయమైన ఈ రోడ్ల గుండా వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం అంబేడ్కర్ నగర్‌లో రోడ్ల విస్తరణ పనులు నిర్వహిస్తున్నారని, కొనసాగింపుగా ఉన్న ఈ రోడ్డును అభివృద్ధి చేస్తే బాగుంటుందని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు వల్లపు సుభాన్‌యాదవ్, బంగారి అశోక్, నర్సింగ్, వెంకటేశ్, అజయ్, తనీశ్ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

సమస్యలు పరిష్కరించాలని ఆశల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆశవర్కర్లు

మీర్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని వేడుకున్నారు. ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కవిత, అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశవర్కర్లు మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. దీనికి స్పందించిన ఆమె అసెంబ్లీలో తమ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం బాలాపూర్ మండల అధ్యక్షురాలు నీలావతి, ప్రధాన కార్యదర్శి తోట్ల భాగ్యలక్ష్మి, కోశాధికారి బి.సుజాత, సీఐటీయూ జిల్లా నాయకులు బుట్టి బాలరాజు, శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

ఇంకా కొన్ని రోజులే..!

- అభివృద్ధికి సహకరించండి
- మీర్‌పేట కార్పొరేషన్‌లో కార్పొరేటర్ల వినతులు
- డివిజన్లలో పెండింగ్, నూతన పనులు మంజూరు చేయాలని అధికారులపై ఒత్తిళ్లు



మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

మీర్‌పేట: ఇంకా కొన్ని రోజులే ఉన్నాయని.. సత్వరమే తమతమ డివిజన్లలో పెండింగ్ పనులతో పాటు కొత్తగా ఇంకొన్ని పనులకు నిధులు మంజూరు చేసి శంకుస్థాపనలు చేయించాలని అధికారులపై కార్పొరేటర్లు ఒత్తిళ్లు తెస్తున్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీ కాలం ఈ నెల 27తో ముగియనుండడంతో మీర్‌పేటలోని ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులపై హడావుడి చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా మున్సిపల్ కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఆయా డివిజన్లలో పెండింగ్ పనులు ఎన్ని ఉన్నాయి? ఉంటే వెంటనే టెండర్లు వేసి పూర్తి చేయించాలని, పదవీకాలం ముగిసేలోపే నూతన పనులకు శంకుస్థాపనలు చేయాలని అధికారులను కోరుతున్నారు.

మళ్లీ అవకాశం ఉండదనే...

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను యథావిధిగా కొనసాగించి ఎన్నికలు నిర్వహిస్తారో లేదోనని, లేక జీహెచ్ఎంసీలో విలీనం చేస్తే మరలా ప్రజాప్రతినిధిగా అవకాశం రాకపోవచ్చని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు తమ డివిజన్లలో అభివృద్ధి పనులు చేయించుకుంటే కనీసం శంకుస్థాపన శిలాఫలకాలపై కార్పొరేటర్లుగా తమ పేర్లు ఉంటే తమ హయాంలోనే పనులు చేయించామని చెప్పుకునే అవకాశమైనా మిగులుతుందని వారు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇక్కడ మరో విశేషం ఏమిటంటే ప్రజాప్రతినిధుల్లో సగం మంది కాంట్రాక్టర్లే ఉండటం గమనార్హం. ఇప్పటికిప్పుడు అభివృద్ధి పనులపై కార్పొరేటర్లు చూపిస్తున్న ఉత్సాహాన్ని చూసి ఇన్నేళ్లలో లేని ప్రజాసేవ ఇప్పుడు గుర్తొచ్చిందా? అని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ఎన్నికల పుణ్యమా ఆయా డివిజన్లలో పెండింగ్ పనులైనా పూర్తవుతాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

- బీఆర్ఎస్ ఆమనగల్లు అధ్యక్షుడు పత్యానాయక్

ఆమనగల్లు: పట్టణంలో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన వివిధ అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని బీఆర్ఎస్ ఆమనగల్లు అధ్యక్షుడు పత్యానాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాచేసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పత్యానాయక్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి రూ.4.5 కోట్లు, జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి రూ.2.5 కోట్లు మంజూరు చేశారన్నారు. ఆయా అభివృద్ధి పనులు ప్రారంభించిన అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో నిధులు నిలిపివేశారని ఆరోపించారు. నిలిచిపోయిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి పూర్తిచేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, నాయకులు ఖలీల్, సాయిలు, వెంకటయ్య, వెంకటేశ్, రమేశ్, శివకుమార్, యాదయ్య, సైదులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న పత్యానాయక్

భూ భారతితో రైతులకు మేలు

ఆమనగల్లు: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతితో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టం చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతుందని అన్నారు. రాష్ట్రంలోని 50 లక్షల మంది రైతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆమె చెప్పారు. భూ భారతి చట్టం అమలు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు టీ షర్టుల అందజేత

మాడ్గుల: విద్యావ్యవస్థ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహ్మద్ బాబా అన్నారు. సీఎం కప్ క్రీడల్లో భాగంగా ఎంపికైన విద్యార్థులకు శుక్రవారం మండల పరిధిలోని కలకొండ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు పదో తరగతిలో మంచి మార్కు లు సాధించాలన్నారు. విద్యా ద్వారానే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యపడుతుందా న్నారు. ప్రధానోపాధ్యాయులు రవీ ందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి కృషి
చైర్‌పర్సన్ హేమలత

తుక్కుగూడ: తుక్కుగూడ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని చైర్‌పర్సన్ బరిగెల హేమలత పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలోని 9వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత విషయంలో రాజీ పడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శివకుమార్, భావన, నాయకులు రాజు, దేవేందర్, శేఖర్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ఉండాలి

- ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని, కాంట్రాక్టర్లు నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎన్కెపల్లి నుంచి బాకారం వరకు వారం రోజుల క్రితం ప్రారంభమైన పనులను ఆయన పరిశీలించారు. బాకారం సమీపంలో వాగుకు వేస్తున్న కల్వర్టును పరిశీలించి మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లు నాణ్యతతో రోడ్డు పనులను పూర్తి చేయాలని, వీటిని అధికారులు పరిశీలించాలన్నారు. కొన్నేళ్ల నుంచి రోడ్డు పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో వారం రోజుల క్రితమే ప్రారంభించామన్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, అనిల్, రాములు, కృష్ణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆశలకు కనీస వేతనం ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా

ఇబ్రహీంపట్నం: ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో కార్యాలయం గేట్‌కు వినతిపత్రం అంటించారు. అనంతరం బ్రహ్మయ్య మాట్లాడుతూ.. ఇరవై ఏళ్లుగా గ్రామాల్లో సేవ చేస్తున్న ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం లేదన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఆశ వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇచ్చేలా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బుగ్గ రాములు, చందునాయక్, ఎల్లేశ్, యాదగిరి, ఆశ వర్కర్లు మణెమ్మ, సుకన్య, లావణ్య, నాగమణి, చంద్రకళ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ హామీలను నెరవేర్చాలి

- కిసాన్‌మోర్చా నేతల డిమాండ్
- తహసీల్దార్ సునీతారెడ్డికి వినతి



ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

ఇబ్రహీంపట్నం: రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ కిసాన్ మోర్చా నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీతారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని తెలిపారు. రైతుబంధు పత్తాలేదని, రైతు కూలీలకు రూ.12 వేలు ఇవ్వలేదని, ఫసల్ బీమా అమలు చేయడం లేదని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు పంట సాయాన్ని రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు ముత్యాల భాస్కర్, నాయిని సత్యనారాయణ, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి, రమణారెడ్డి, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వామి వివేకానంద మార్గం ఆదర్శనీయం

చేవెళ్ల: స్వామి వివేకానంద చూపించిన మార్గాలు అందరికీ ఆదర్శనీయమని ఏబీవీపీ చేవెళ్ల నగర అధ్యక్షుడు శ్రీశైలం, విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహిపాల్ అన్నారు. మండల కేంద్రంలోని సత్యసాయి పాఠశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో భాగంగా మండలంలోని విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏబీవీపీ అంటే కేవలం ఉద్యమాలను మాత్రమే కాదని యువతకు ఆదర్శంగా నిలబడేందుకు కావాల్సిన కృషిని అందిస్తుందన్నారు. వివేకానంద యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని చెప్పాడన్నారు. వ్యాసరచన పోటీలతో పాటు యువత, విద్యార్థులకు ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు స్పోర్ట్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు నితీష్, శ్రీకాంత్, అరవింద్, కిషోర్, అనిల్, విజయ్, మల్లేశ్, శ్రీకాంత్, హరీష్, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

షాబాద్: విద్యార్థుల్లోని ప్రతిభా పాటవాలను పెంపొందించేందుకు వ్యాసరచన పోటీలు దోహదం చేస్తాయని షాబాద్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవింద్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో ముందస్తుగా వివేకానంద జయంతిని పురస్కరించుకుని మండలంలోని విద్యార్థులకు వివేకానంద పాదువు సంఘం ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మల్లికార్జున్, రజనీకాంత్, చంద్రయ్య, గౌరీశ్వర్, రాము, ఉపాధ్యాయులు సునీల, బాల్‌రాజ్, కరుణాకర్‌రెడ్డి, తదితరులున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పతంగులు ఎగరేయొద్దు

మొయినాబాద్: విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్‌ల వద్ద పతంగులు(గాలిపటాలు) ఎగురవేయడం ప్రమాదకరమని మండల విద్యుత్ ఏఈ హమునాయక్, లైన్‌మెన్ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాలు ఎగురవేసేటప్పుడు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను తెలియజేశారు. బహిరంగ ప్రదేశాలు, మైదానాల్లో మాత్రమే పతంగులు ఎగురవేయాలన్నారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్‌లు ఉన్న చోట గాలిపటాలు ఎగురవేయవద్దని చెప్పారు. గ్లాస్ కోటింగ్ లేని కాటన్ మాంజాలు మాత్రమే వాడాలని.. నైలాన్, సింథటిక్ మాంజాలు వాడవద్దన్నారు. మెటాలిక్ మాంజాలకు కరెంటు పాస్ అవుతుందని.. అవి విద్యుత్ తీగలపై పడితే కరెంటు షాక్ కొట్టే ప్రమాదం ఉంటుందన్నారు. తేమ వాతావరణంలో పతంగులు ఎగురవేస్తే విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. పొడి వాతావరణంలోనే పతంగులు ఎగురవేయాలని సూచించారు. పతంగులు, మాంజాలు విద్యుత్ తీగలపై పడితే వాటిని వదిలేయాలని.. లాగితే విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలి ప్రమాదాలు జరుగుతాయన్నారు. ఇళ్ల బాల్కానీలు, గోడల పైనుంచి పతంగులు ఎగురవేస్తే కింద పడిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. పతంగులు ఎగురవేసేటప్పుడు తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలని సూచించారు.